# తల్లిలేని పిల్లాడు

- ఎమ్. నిర్మల -

అమ్మ! ఆ రెండక్షరాలకి ఎంత అర్థం వుంది. ఎంత ఆప్యాయత వుంది. నిజమే. అమ్మ వున్న వాళ్ళందరూ అదృష్టవంతులే. కానీ నాకు అమ్మ లేదు. అన్నీ వున్నా అమ్మ లేని నేను దురదృష్టవంతుడినే. ఆలోచనల్లో కొట్టుకుపోతున్న విశ్వనాథ్ నాయనమ్మ పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాడు. అరగంట నుంచి పుస్తకాలు ముందేసుకుని కూర్చున్నా దృష్టి చదువు మీద లేదు. ఆలోచనలన్నీ అమ్మ చుట్టూనే వున్నాయి.



"ఒరేయి విస్సూ! భోజనానికి రారా! అన్నం తిని మళ్ళీ చదువుకుందువుగానీ" వంటింట్లో నుండి ఆవిడ గొంతు విన్పిస్తోంది. తప్పదన్నట్లు లేచి భోజనం ముగించి వచ్చాడు విశ్వనాథ్.

తనకీ అమ్మ వుంటే బాగుండేది. నాయనమ్మ ఎంత ప్రేమగా చూసినా, ఎంత గారాబం చేసినా, ఎవరి ప్రేమ వాళ్ళదే. ఇప్పుడిప్పుడే తనకి ఆ లోటు తెలుస్తోంది. తన తోటి పిల్లలందరూ అమ్మా నాన్నల గురించి చెవుతూంటే తనకి ఆ అవకాశం లేనందుకూ, పైగా అందరూ తనని తల్లి లేని పిల్లాడని చిన్నప్పటినుండీ జాలిగా చూడడం తనకి బాధాకరంగానే వుండేది. అయితే ఇంత సీరియస్‌గా తను ఎప్పుడూ ఆలోచించలేదు. ఈ మధ్యనే తన ఆలోచనల్లో మార్పు వచ్చింది. బామ్మ తనకన్నీ అమర్చి పెట్టగలదు కానీ, తనతో అనుభవాలు, ఆటపాటలు పంచుకోలేదు. సరే ఇక తండ్రి వున్నాడంటే ఆయన తనని ఎంత గారాబంగా చూస్తాడో చెప్పలేం. అడగకుండానే అన్నీ తెచ్చిస్తాడు. తను దేనికీ బాధ పడకూడదని ఆయన ఉద్దేశం. అంతేకానీ, తనతో సమానంగా ఆడీ పాడి తన సంతోషంలో పాలుపంచుకోలేడు. ఆ ఆలోచనే ఆయనకి రాదు. ఆయన ప్రపంచం వేరు. పల్లెటూళ్ళో వుండడం వలన కరణంగా ఆయన కీలకపాత్ర వహిస్తుండడం చేతా, ఇంటికి వచ్చే పోయే వాళ్ళతో ఆయనకి క్షణం తీరిక వుండదు. తనకి ముద్దూ ముచ్చటా తీరే అవకాశం అంతగా లేకపోయింది. ఒక రకంగా చెప్పాలంటే తను అందరూ వుండి కూడా ఒంటరివాడు. అమ్మ ఫోటో చూసినప్పుడల్లా తనకి ఎంతో బాధ కలుగుతుంది. పసినాడే తనకి ఆ దేవుడెందుకింత అన్యాయం చేశాడో మరి. ఎవరు మాత్రం ఏం చెయ్యగలరు. ఆయన తీర్పు అలా వుంది. ఇది బామ్మ సిద్ధాంతం. తనకీ ఒంటు బట్టింది.

* * *

ఆరోజు సుశీలత్తయ్య వాళ్ళు రావడంతో వాళ్ళబ్బాయి ఆనంద్‌తో ఆటల్తో కాలక్షేపం చేస్తున్నాడు విశ్వనాథ్. ఆడి, ఆడి మంచినీళ్ళు తాగుదామని వంటింట్లోకి వస్తూంటే సుశీలత్తయ్య బామ్మతో రహస్యంగా ఏదో చెప్తోంది. తన పేరు వాళ్ళ సంభాషణలో వినబడేసరికి గుమ్మం దగ్గరే ఆగిపోయాడు.

"ఎక్కడ కనిపించింది నీ కింతకీ అది" బామ్మ అడుగుతోంది.

"అదేనే. సూర్యారావుపేట ఆంధ్రా బ్యాంక్ పక్క సందులో. అక్కడే వుంటున్నట్లుంది. ఇప్పుడెవర్ని పట్టిందో మహాతల్లి. అయినా దానికదేం బుద్ధి. ఇంతకీ విసిగాడు అన్యాయం అయిపోయాడు. చస్తే ఒక ఏడ్పు ఏడ్చి ఊరుకునేవాళ్ళం. ఇది బతికుండి మన పరువు తీస్తోంది. ఓ డాక్టరు నెవరినో పట్టిందనుకుంటాను. ఇంటి ముందు బోర్డు కూడా వుంది. డాక్టరు రాజారావు అని"

"అయితే ఇన్నేళ్ళ తర్వాత హేమ నిన్ను గుర్తుపట్టిందా?"

"అసలు నన్ను చూడలేదు తను. నేను కూడా ముఖం తప్పించుకునే వచ్చేశాను. అయింది అయినాక ఎదురుపడడం కూడా ఎందుకులే అని" అత్తయ్య చెప్తోంది.

విసు మెదడులో వెయ్యి ప్రశ్నలు. విసుగాడ్ని అన్యాయం చేసిపోయిందని అంటోంది. హేమ అంటే తన తల్లి కాదు కదా? అంటే అమ్మ చచ్చిపోలేదా? బతికే వుందా? మరి తననెందుకు విడిచిపోయింది. మరి ఇంట్లోవాళ్ళు అమ్మ చచ్చిపోయిందని తనకెందుకు చెప్పారు? అంటే అబద్ధం చెప్పారన్నమాట. అయితే నాన్న నడగాలి. వీళ్ళు తనకి నిజం చెప్పరు. నాన్నయితే తప్పకుండా నిజం చెప్తారు. రాత్రికి అన్నం తినకుండా తండ్రి కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు.

"ఏరా! అన్నం తినకుండా నాకోసం ఎందుక్కూర్చున్నావు... రా! భోంచేద్దాం" నాన్న ప్రేమగా పిలుస్తుంటే కళ్ళలో నీళ్ళు తిరిగాయి విసుకి.

పక్కమీద పడుకున్నా నిద్రపోవటం లేదు. పత్తికాయలంత గుడ్లేసుకుని ఇంటి కప్పు కేసి చూస్తూ పడుకున్నాడు. తండ్రికి ఆశ్చర్యం వేసింది. రాత్రి పది దాటితే నిద్ర మేలుకుని వుండని కొడుకు అలా నిద్రపోకుండా ఆలోచిస్తుండడం ఆయనకి విచిత్రంగా తోచింది.

"ఏం నాన్నా! నిద్ర రావట్లేదా?" తల మీద చెయ్యి వేసి నిమురుతూ అడిగాడు.

"నాన్నా! నేనొకటి అడుగుతాను. నిజం చెప్తారా?"

కొడుకి విధంగా ఎప్పుడూ మాట్లాడలేదు. ఆశ్చర్యపోతూనే "అడుగు బాబూ! నాకు తెలిస్తే చెప్తాను" ఆయన సమాధానం చెప్పాడు.

"మరి! మరి! అమ్మ నిజంగా చచ్చిపోలేదా?"

కొడుకు మాటలకి కృష్ణారావు వెంటనే జవాబు చెప్పలేకపోయాడు. కొంచెంసే పాగి "ఎవరు చెప్పారు బాబూ!" అడిగాడు.

"ఎవరు చెప్పినా, చెప్పకపోయినా నిజం అదే కదా నాన్నా! అమ్మ బతికే వుంది కదూ! అసలు ఎందుకు వెళ్ళిపోయింది"

"అవును బాబూ! ఇంతదూరం వచ్చాక నీకు నిజం తెలియాల్సిందే. అమ్మ చచ్చిపోలేదు. మనని వదలిపెట్టి వెళ్ళిపోయింది. తనకి నాతో జీవితం నచ్చలేదు. అందుకే నువ్వు ఏడాది పిల్లవాడిగా వున్నప్పుడు వెళ్ళిపోయింది. అయితే వాళ్ళ పుట్టింటికి కూడా వెళ్ళలేదు. ఏమైందో ఎవరికీ తెలియదు. ఊళ్ళో తెలిస్తే పరువు పోతుందని మేం పోలీస్ రిపోర్టు కూడా ఇవ్వలేదు. నిన్ను చూసుకుంటూ నేను ఒంటరిగా బతుకుతున్నాను."

"మరి తాతయ్య వాళ్ళు కూడా ఏమీ అనలేదా?"

"లేదు. వాళ్ళమ్మాయి ఇంట్లో నుండి వెళ్ళిపోతే వాళ్ళకీ పరువు తక్కువ కదా! అందుకే వాళ్ళు కూడా గొడవ చెయ్యలేదు."

విశ్వనాథ్‌కి తండ్రిని చూస్తే జాలేసింది. తల్లి మీద విపరీతమైన కోపం వచ్చింది. తనకి, తండ్రికి తీరని అన్యాయం చేసిన తల్లిని చూడాలని ఆసక్తి చచ్చిపోయింది. మామూలుగా చదువులో పడిపోయాడు. కానీ అప్పుడప్పుడు అనిపిస్తూండేది. అసలు తల్లి ఎందుకు వెళ్ళిపోయిందో తెలుసుకోవాలని. అవకాశం దొరికితే తప్పకుండా నిలదీసి అడగాలనే కోరిక మాత్రం చావలేదు.

* * *

"బాబూ! నిన్ను హాస్టల్లో చేర్పించి వెళ్ళిపోవటం నాకు చాలా బాధగానే వున్నది. నిన్ను విడిచి నేనెప్పుడూ వుండలేదు. అయినా తప్పదు. నువ్వు బాగా చదువుకుని పైకి రావాలి. అదే నా కోరిక" ఇంటర్‌లో చేర్పించి తనని హాస్టల్లో వదలి వెళ్ళలేక వెళ్ళలేక వెడుతున్న తండ్రిని చూస్తుంటే విశ్వనాథ్‌కి కూడా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఇన్నాళ్ళూ తండ్రినీ, ఊరినీ వదలి దూరంగా వెళ్ళిన పాపాన పోలేదు. ఈ చదువు కోసం ఇలా రావలసి వచ్చింది. ఇప్పుడు తను ఏడిస్తే తండ్రి ఇంక ఇంటికి తిరిగి వెళ్ళలేడు. ఎవరన్నా చూస్తే కూడా బాగుండదు ఈ వయసులో తను ఇలా బెంగపడితే. కళ్ళు తుడుచుకుని తనకి తను ధైర్యం చెప్పకుని తండ్రికి వీడ్కోలిచ్చాడు.

* * *

"నీకోసం ఎవరో వచ్చార్రా విస్సూ!" రూమ్మేటు చెప్పడంతో చేతిలోని పుస్తకం పక్కన పడేసి విజిటర్స్ రూమ్‌లోకి అడుగుపెట్టిన విశ్వం వచ్చిన వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయాడు. తన పెద్దనాన్న. అంటే తన పెద్దమ్మ భర్త. తల్లికి అక్కవుతుంది ఆవిడ. తల్లి పోయినాక రాకపోకలు తగ్గిపోయినా, పూర్తిగా బంధాలు మాత్రం తెగిపోలేదు.

"ఏరా విస్సూ! బాగున్నావా?"

"నువ్విక్కడ చేరావని తెలిసి మీ పెద్దమ్మ నిన్ను చూసి రమ్మని పంపించింది. తను కూడా రావాలనే అనుకుంది. కానీ రాలేకపోయింది. సెలవుల్లో వస్తూంది. ఇప్పుడు నాతో వస్తే తీసికెడతాను. సాయంత్రందాక వుండి వచ్చేద్దువు గానీ. ఇల్లు చూస్తే నీ ఇష్టం వచ్చినపుడు వచ్చి పోవచ్చు. ఏమంటావు?"

ఆయనంత ఆప్యాయంగా పిలుస్తూంటే తప్పనిసరిగా బయలుదేరాడు. సాయంత్రం దాకా వాళ్ళతో సరదాగా గడిపి హాస్టలుకి వచ్చాక గుర్తొచ్చింది. పెద్దమ్మ నడిగితే తల్లి విషయం చెప్పగలిగి వుండేదని. 'ఇంకోసారి వెళ్ళినపుడు తప్పకుండా అడగాలి' గట్టిగా అనుకున్నాడు.

* * *

పేద విద్యార్థుల కోసం ఓ బెనిఫిట్ షో ఏర్పాటుచేశారు కాలేజీ విద్యార్థి సంఘం వాళ్ళు. అందరికీ తలా కొన్ని టిక్కెట్లు ఇచ్చారు అమ్మమంటూ. ఊళ్ళో ప్రముఖుల దగ్గరికి వెడితే తొందరగా అమ్ముడుపోతాయి టిక్కెట్లు. సూర్యారావుపేట నిండా డాక్టర్లు, లాయర్లు, ప్రముఖ వ్యాపారస్థులు వున్నారు. దాదాపు టిక్కెట్లన్నీ అమ్మేశారు. ఇంకా ఓ అరడజను మాత్రమే వున్నాయి. ఇవి కూడా అమ్మేస్తే అయిపోతుందని అనుకుంటూ ఎదురుగా వున్న ఇంటి మెట్లెక్కారు విశ్వనాథ్ బృందం.

కాలింగ్ బెల్ నొక్కారు.

"నమస్కారమండీ! పేద విద్యార్థుల సహాయం కోసం బెనిఫిట్‌షో ఏర్పాటుచేశాం. మీరు రెండు టిక్కెట్లు తీసుకోవాలి" తలుపు తీసిన వ్యక్తికి చెప్పారు పిల్లలు.


"లోపలికి రండి బాబూ! ఇలా కూర్చోండి" ఆయన లోపలికి పిలిచాడు. "మంచినీళ్ళు కావాలా?" అంటూనే లోపలికి చూస్తూ "హేమా! ఇలా కొంచెం మంచినీళ్ళిచ్చి నా పర్సు ఇలా పట్రా" తను కూడా కుర్చీలో కూర్చున్నాడాయన.

"రెండు టిక్కెట్లూ యాభై రూపాయిలు సార్" ఓ విద్యార్థి అన్నాడు.

"సరే. సరే. ముందు మంచినీళ్ళు తాగండి" ఆయన ఎంతో ఆప్యాయంగా అంటున్నాడు.

మంచినీళ్ళు తెచ్చిన ఆవిడని చూడగానే విశ్వనాథ్ అలా నిలబడిపోయాడు. అమ్మ ఇన్నాళ్ళూ చచ్చిపోయిందని అనుకున్న అమ్మ ఇలా కళ్ళముందు సజీవంగా నిలబడింది. అదీ ఇంకొకరి భార్య స్థానంలో. అమ్మా అని పిలిస్తే ఆవిడ ఎలా స్పందిస్తుంది. ఒక్క క్షణం తన పక్కన వున్న వాళ్ళందరూ మాయమైపోయి తనూ, అమ్మ మిగిలితే బాగుండును. తను అడగాలనుకున్నవన్నీ అడిగెయ్యొచ్చు. కానీ ఆవిడ ఎదురుగా వున్నా మాట్లాడలేని స్థితి. తను ఆవిడ కొడుకునని తెలిస్తే సంతోషిస్తుందా? ప్రశాంతంగా వున్న ఆవిడ జీవితంలో తను ఒక చేదు జ్ఞాపకం కాదు కదా! ఒకసారి ఆవిడతో మాట్లాడగలిగితే బాగుండును. ఇప్పుడు కాకపోయినా మరోసారి ఆ ప్రయత్నం చెయ్యాలి. తనతో వచ్చిన పిల్లలు ఆయన దగ్గర డబ్బులు తీసుకుని టిక్కెట్లు ఇచ్చేశారు కూడ. వాళ్ళు తట్టి పిలిచేవరకు స్పృహలోకి రాలేదు విశ్వనాథ్.

* * *



"పెద్దమ్మా! మా అమ్మ బతికే వుంది కదూ" అనుకోని ప్రశ్నకు ఆశ్చర్యపోయింది భవాని.

"లేదు నాన్నా! చనిపోయింది" ఎటో చూస్తూ జవాబు చెప్పింది.

"పెద్దమ్మా! నువ్వు నా దగ్గర దాచాలని చూడకు. నాకంతా తెలుసు. అమ్మ నన్ను వదలిపెట్టి వెళ్ళిపోయింది కదూ! నిజం చెప్ప, నీకు ఆవిడ గురించి తెలుసు కదూ! అయినా అలా వదలిపెట్టి వెళ్లటానికి ఆవిడ మనసెలా ఒప్పింది పెద్దమ్మా"

"ఇంతకీ నీకెవరు చెప్పారు నాయనా?"

"ఎవరు చెప్పినా విషయం నాకు తెలిసింది కదా! అమ్మ అలా చెయ్యటానికి కారణం నీకు తెలిస్తే చెప్ప, ఏమైనా సరే. నిన్ను ఈ రోజు వదలిపెట్టను"

"ఏం చేస్తుంది నాయనా! పరిస్థితులలా వచ్చాయి" నిట్టూర్చి మళ్ళీ చెప్పిందావిడ. "మీ అమ్మ చాలా అందంగా వుండేది. మీ నాన్నకేమో అనుమానం. పనివాళ్ళతో మాట్లాడకూడదు. పాలేరు కంట పడకూడదు. బయటికి అసలే రాకూడదు. అదసలే పల్లెటూరు. అన్నీకట్టుబాట్లే. రోజూ అనుమానంతో గొడ్డును బాదినట్లు బాదేవాడు. పైన మానసికంగా కూడా అతను పెట్టే చిత్రహింసలు చెప్పే పనే లేదు. విసిగిపోయింది పాపం. అతను పెట్టే బాధలు పడలేక పారిపోయి పుట్టింటికి రాలేక, ఎవరికీ చెప్పకోలేక, హిస్టీరిక్‌గా మారింది. దాంతో ఇంట్లో వాళ్ళు ఆమెకి దయ్యం పట్టిందనీ, గాలీ అనీ, భూతవైద్యాలు చేయించడం మొదలుపెట్టారు. వాళ్ళు పెట్టే హింసలు భరించలేక ఓ రోజు తెల్లవారుజామున చచ్చిపోవాలని బయలుదేరింది. అప్పడే రైలు దిగి వస్తున్న ఆ ఊరి స్కూలు మాస్టారు మీ అమ్మని రక్షించారు

మాస్టారు సాయం చేసినా, మానవతాదృష్టితో చేశారు. లోకం చెప్పకున్నట్లు మీ అమ్మ ఆయనతో లేచిపోలేదు. ఆ తర్వాత కొన్నాళ్ళకి ఓ డాక్టరుగారు అమ్మ సంగతి తెలిసి సహృదయంతో పెళ్ళిచేసుకున్నారు. ఇప్పడు ఈ ఊళ్ళోనే వుంటూంది. అయినా మేమెప్పడూ వెళ్ళం. మానిన గాయం మళ్ళీ రేపటం ఇష్టంలేక. మీ అమ్మ గురించి నీకెవరు ఏం చెప్పారో నాకు తెలియదు గానీ జరిగిన నిజం మాత్రం ఇదే. ఒకవేళ మీ అమ్మ పట్ల అపోహ వుంటే అది తొలగించుకో. ఆవిడ పరిస్థితి అర్థం చేసుకో. ఇటువంటి స్థితి మాత్రం ఎవరికీ రాకూడదు బాబూ!" ఆవిడ కళ్ళు తుడుచుకుంది.

ఆ క్షణాన అమ్మ దగ్గరకెళ్ళి వాలిపోవాలనిపించింది విసుకి. మనసంతా బాధతో నిండిపోయింది.

చెల్లెళ్ళు సినిమాకి వెడదామంటే మనసుకి కాస్త మార్పుగా వుంటుందని తనూ బయలుదేరాడు. వాళ్ళు వెళ్ళేసరికి సినిమా మొదలైపోయింది. చీకట్లో సీట్లు వెదుక్కుంటూ వెళ్ళి కూర్చున్నారు.

"ఎన్నాళ్ళీ దొంగ బతుకు? మీ భార్యగా నాకు గుర్తింపు ఎప్పడు? ఇది మాత్రం బాగుండలేదు" వెనుకసీట్లో మాటలు.

"చూడు! ఇన్నాళ్ళు ఓపిక పట్టావు. ఇంకా కొన్నాళ్ళు ఓర్చుకో. బాబుకి నీ సంగతి ఎంత మాత్రం తెలియదు. ఒక్కసారిగా నువ్వు ఎదురుపడితే కష్టంకదా! వాడిని మానసికంగా సిద్ధం చేసి అప్పడు నీ గురించి చెప్తాను." సందేహం లేదు ఇది తన తండ్రి గొంతే. తల్లి చేసిన పనే తండ్రీ చేశాడు. కానీ ఆ విషయం దాచిపెట్టి పెద్దమనిషిలా చెలామణీ అవుతున్నాడు. తల్లి కూడ అదే పని చేసింది మరి. అయినా ఆవిడ పరిస్థితి వేరు. నిస్సహాయ స్థితిలో ఆవిడ అంతకంటే ఏం చెయ్యగలదు? ఆవిడ చేసిన తప్పేమిటి?

డాక్టరుగారు ఎంత సహృదయులైనా, తను ఇప్పడు ఆవిడ ఎదుటపడితే ఆవిడకి మనశ్శాంతి వుండదు. నిశ్చల తటాకంలాటి ఆవిడ జీవితంలో మళ్ళీ అలజడి రేగుతుంది. అందుకే తను ఆవిడని కలవకూడదు. ఆవిడకి తను చేయదగ్గ సహాయం అదే. తన జీవితంలో ఆవిడని చూసిన తృప్తి చాలు. ఆమె క్షేమం దృష్ట్యా తను ఎప్పటికీ తల్లిలేని వాడిగా మిగిలిపోవాలి.

"అమ్మా నిన్ను చూడాలని ఎంత అనిపించినా, నీకు దగ్గరకాలేని ఈ అశక్తుడిని క్షమించు!"

ఎవరూ చూడకుండా కళ్ళు తుడుచుకున్నాడు.


# మృదువైన పట్టులాంటి చర్మం యిక మీ సొంతం చేసుకోండి.

ప్రపంచ ప్రఖ్యాతి పొందిన న్యూయార్క్ (అమెరికా) సంస్థ వారి అత్యాధునిక ఎలక్ట్రాలసిస్ ప్రక్రియద్వారా యిప్పుడు మీరు పై పెదవి గడ్డం, కనుబొమ్మలు మొదలైన ప్రదేశాలలో అసహ్యంగా కనిపించే వెంట్రుకలని శాశ్వతంగా తొలగించుకోండి.
ఈవిధానం చాలా సులభమైనది. ఎటువంటి మచ్చలు మిగల్చదు. కొంచెం కూడా బాధ కలుగదు.
మా బ్యూటీ పార్లల్‌లో హెన్నా మరియు యితర సంపూర్ణ హెర్బల్ చికిత్సలు కూడా లభిస్తాయి.
మీరు బ్యూటీషియన్ కోర్సులలో కూడా చేరవచ్చు. రెండు బ్యాచీలు మాత్రమే.

ఆడవారికి మాత్రమే
సంప్రదింపులు ఉచితం
ఉదయం. 9 గం॥ నుండి
సాయంత్రం 6 గం॥ వరకు
ఆదివారం శెలవు



**మీ సందేహాల నివృత్తికి, సలహాలకీ మాకు వ్రాయండి.**
అపాయింట్‌మెంట్ కొరకు సంప్రదించండి.

**షరాన్ ఎలక్ట్రాలసిస్**
నలంద, మెడినోవా వెనుక, అమృత ఎస్టేట్స్
సోమాజిగూడ, హైదరాబాద్. ఫోన్ : 390308